ప్రజాశక్తి

సోమవారం 10 మార్చి, 2025 | 5 | శ్రీకాకుళం

నేడు జెడ్‌పిలో 'మీకోసం'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 10న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్వాడీల గృహ నిర్బంధం

- 'చలో విజయవాడ'ను అడ్డుకునేందుకు యత్నం
- నాయకులు, కార్యకర్తల ఇళ్ల వద్ద పోలీసులు
- కొన్నిచోట్ల నోటీసులు అందజేత



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలంగా చిన్నారులకు, బాలింతలకు, గర్భవుతులకు సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను, సహాయకులను క్రమబద్ధీకరణ, గ్రాట్యుటీ కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. దీనిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నగరంలోని కార్యకర్తల ఇళ్ల వద్ద గడచిన 24 గంటల వ్యవధిలో పోలీసుల కాపలా ఉండి వారి రాకపోకలను నిశితంగా పరిశీలించి గృహ నిర్బంధించారు. నాయకులకు విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళ్లొద్దంటూ పోలీసులు నోటీసులు అందజేశారు. పోలీసు ఆంక్షలు ఉండబోవని, ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగుతుందని ఎన్నికలకు ముందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలకు భిన్నంగా ఇప్పుడు ఆంక్షల పాలన కొనసాగిస్తున్నారన్న భావన ప్రజల్లో వ్యక్త మవుతోంది.

అంగన్వాడీ కేంద్రాల్లో కొన్నేళ్లుగా కార్యకర్తలు, సహాయకులు పనిచేస్తున్నారు. నిర్వహణలో భాగంగా సాక్షమ్ అంగన్వాడీ, పోషణ్ 2.0 స్కీంలకు 50 ఏళ్లు పూర్తయింది. అయినా, కార్యకర్తలకు కనీస వేతనాలు అందడం లేదు. రూ.26 వేలు కనీస వేతనాన్ని చెల్లించాలని గడచిన కొన్నేళ్లుగా అంగన్వాడీలు ఉద్యమిస్తున్నారు. అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను వరుసగా గ్రేడ్-3, గ్రేడ్-4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి 7వ పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచి రెగ్యులైజేషన్ చేయాలని కోరుతున్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అందరికీ వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించాలని, రాజ్యాంగ ప్రాథమిక హక్కుగా ఉన్న ఆరేళ్ల లోపు వయసు కలిగిన పిల్లలందరికీ శిశు సంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడా నిధులను బడ్జెట్లో కేటాయించాలని కోరుతున్నారు. దీనికి తోడు మినీ కేంద్రాల పేరుతో తక్కువ వేతనాలు చెల్లించి కార్యకర్తలతో పాటు సహాయకుల విధులను ఒక్కరి చేత చేయిస్తున్నారు. విద్యార్హత ఉన్నా ఏళ్ల తరబడి సూపర్ వైజరు ఉద్యోగోన్నతులు కల్పించకుండా జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్హతలు ఉన్న అంగన్వాడీలు కార్యకర్తలుగానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోంది. దీనికితోడు సహాయకుల్లో అర్హతలు ఉన్నా వారికి కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని గడచిన కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో సుదీర్ఘ కాలం సమ్మె చేసిన తర్వాత చర్చలకు ఆహ్వానించి యూనియన్‌తో పలు ఒప్పందాలు చేసింది. కానీ, ఇంతవరకు వాటికి జిఒలు ఇవ్వలేదు. సమస్యలు పరిష్కరిస్తూ తక్షణమే జిఒలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు అంగన్వాడీ కేంద్రాల్లో సదుపాయాల కొరత వేధిస్తోంది. శిథిలమైన గదులు, అద్దె భవనాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు కష్టాలు తప్పడం లేదు. వేసవి సీజన్ మొదలు కావడంతో ఉక్క పోత తీవ్రమవుతోంది. సొంత భవనాల కోసం ఎన్నోఏళ్లుగా కోరుతున్నా నిర్మాణాలు చేపట్టడం లేదు. కొన్ని చోట్ల భవనాలు మంజూరు చేసినా వాటిని అసంపూర్తిగా వదిలేయడం వల్ల అద్దె భవనాల్లోనే కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోంది. వీటిని సకాలంలో అద్దెలు చెల్లించడం లేదు. అలాగే పెరిగిన ధరలకు అనుగణంగా మెనూ ఛార్జీలు పెంచాల్సి ఉన్నా... పట్టించుకునే వారులేరు. పౌష్టికాహారం అందిస్తున్నామని చెబుతూనే... వాటికి తగినంత బడ్జెట్ కేటాయింపులు చేపట్టడం లేదు. దీంతో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. మరోవైపు వంట గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా అంగన్వాడీలు కోరుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ప్రీ స్కూళ్ల ఏర్పాటుతో పిల్లలు రోజంతా కేంద్రాల్లో ఉండేందుకు అనువైన పరిస్థితులు కల్పించేందుకు మౌలిక వసతులు ప్రభుత్వమే సమకూర్చాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్న అంగన్వాడీలు ఈ నెల 10న 'చలో విజయవాడ'కు పిలుపు నిచ్చారు.

డిమాండ్లు ఇవీ...

- కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యూటీ అమలు
- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు
- హెల్పర్ల ఉద్యోగోన్నతులు
- రాజకీయ జోక్యం అరికట్టాలి
- సంక్షేమ పథకాలు అమలు
- సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చులకు రూ.20 వేలు
- కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం
- సమ్మెకాలంలో చనిపోయిన వారికీ వర్తింపు
- పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టిఎ, డిఎ బిల్లులు చెల్లించాలి
- అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్పు
- పెండింగ్లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీ
- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీల పెంపు
- ప్రభుత్వమే ఉచితంగా గ్యాస్ సరఫరా
- 3 నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవ్
- ప్రీ స్కూల్ బలోపేతం
- ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు
- ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లో ఉంచడం
- ప్రీ స్కూల్ పిల్లలకు సాయంత్రం స్నాక్స్ అందజేత
- ఆరు నెలలు నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలకు ఇకెవైసి, ఫొటోక్యాప్చర్ ఒటిపిలను రద్దు

ఆంక్షలు అర్థరహితం

న్యాయబద్ధమైన కోర్కెల పరిష్కారానికి పోరాటమే శరణ్యం, వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో విజయవాడలో తమ నిరసన తెలపాలని యూనియన్ పిలుపునిచ్చింది. ప్రభుత్వం, పోలీసు ఆంక్షలు విధించింది. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. స్వేచ్ఛగా తమ హక్కుల సాధనకు పోరాడుతుంటే గృహ నిర్బంధం అమలు చేస్తున్నారు.

- కె.కళ్యాణి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు

ముంబయి జైలులో కొడుకును కలిసిన తల్లిదండ్రులు

సీమెన్ ఏజెంట్ల మోసం

జైలుపాలవుతున్న యువ నావికులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సీమెన్ ఏజెంట్ల మోసంతో జిల్లాలోని యువ నావికులు మోసపోతున్నారు. జిల్లాలోని ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన యువ నావికుడు కొమర ప్రవీణ్ గత నెల 5 నుంచి ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలులో ఉన్నాడు. కుటుంబానికి ఏకైక జీవనాధారం అయినందున, తీవ్ర బాధలో ఉన్న అతని కుటుంబం, అతని విడుదలకు సహాయం కోరుతూ భారత నావికుల సంఘం (ఎస్‌యుఐ)ని సంప్రదించారు. భారత నావికుల సంఘం అధ్యక్షుడు ఆర్.పి.వీట్టిల్ జోక్యం చేసుకోవడంతో, ప్రవీణ్ తల్లిదండ్రులు ఈ నెల 6న జైలులో ఉన్న తమ కొడుకును కలవడానికి అనుమతి పొందారు. అతని విడుదలకు సాధ్యమైన అన్ని సహాయాలను అందిస్తామని ఎస్‌యుఐ కుటుంబానికి హామీ ఇచ్చింది.

ప్రవీణ్ ముంబైలో మోసపూరిత ఏజెంట్ల బారిన పడ్డాడు. వారు అతను ఓడలో ప్రయాణించకుండానే తన సిడిసిపై విదేశీ నౌక స్టాంప్‌ను చట్టవిరుద్ధంగా ముద్రించారు. అతను విదేశాలకు ప్రయాణించడానికి ప్రయత్నించినప్పుడు, ముంబై విమానాశ్రయంలోని ఇమ్మిగ్రేషన్ విభాగం మోసపూరిత స్టాంపింగ్‌ను అనుమానించి ధ్రువీకరణ కోసం పంపింది. ఫోర్జరీ నిర్ధారణ తర్వాత, అతన్ని అంధేరి పోలీసులకు అప్పగించారు. తరువాత ఆర్థర్ రోడ్ జైలులో ఉంచారు. అతని బెయిల్ పొందడానికి భారత నావికుల సంఘం చట్టపరమైన ప్రతినిధులతో చురుగ్గా సమన్వయం చేసుకుంటోంది. ఒక సామాన్య మత్స్యకార కుటుంబానికి చెందిన ప్రవీణ్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాడు. అతని తల్లిదండ్రులు తీవ్ర బాధలో ఉన్నారు. న్యాయం జరుగుతుందని, మోసపూరిత కార్యకలాపాల కారణంగా తప్పుగా చిక్కుకున్న యువ నావికుడు త్వరలో విడుదలవుతారని ఆశాగా ఉన్నారు. చాలామంది యువత ఏజెంట్లు చేస్తున్న మోసలా వల్ల జైలపాలు అవుతున్నారు. ఏజెంట్స్ సిడిసిపై తప్పుడు స్టాంప్స్ వేయడం వల్ల బయట దేశాలకు వెళ్తున్నప్పుడు ఇమ్మిగ్రేషన్ విభాగం అధికారులకు అనుమానం వచ్చి సిడిసి పరిశీలించారు. సిడిసిపై ఉన్న స్టాంప్స్ తప్పు అని తెలియడం వల్ల జైలుకు పంపించారు. సిడిసి, పాసుపోర్టుపై స్టాంప్స్ వేయడం చట్టారేత్యా నేరం. అలా చేయడం వల్ల జైలుకి వెళ్లడం, సిడిసి కూడా రద్దయ్యే అవకాశం ఉంది.

డిఎస్‌సికి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డిఎస్‌సి పరీక్ష అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు బిసి స్టడీ సర్కిల్ జిల్లా సంచాలకులు ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షలో అర్హత సాధించిన జిల్లాలోని బిసి, ఇబిసి కేటగిరికి చెందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపిక టెట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలు, తరగతి, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (2 లక్షల లోపు), టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో టిడిపి భవనం వెనుక ఉన్న ఎపి బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో మార్చి 10 నుంచి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 నంబర్లను సంప్రదించాలన్నారు.

రెడ్డీస్ కార్మికుల దాతృత్వం

రామారావుకు నగదును అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న దేవుని పాలవలస గ్రామానికి చెందిన కార్మికుడు బుక్కు రామారావుకు ఇటివలే బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి వచ్చింది. స్పందించిన తోటి కార్మికులంతా డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు నుంచి వసూలు చేసిన రూ.64 వేలు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు చేతులుమీదుగా పాలవలస గ్రామంలో కార్మికుడి ఇంటివద్ద ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ విరాళం అందజేసిన కార్మికులకు అభినందనలు తెలిపారు. యూనియన్ విజ్ఞప్తి మేరకు యాజమాన్యం రూ.లక్ష ఆర్థికసాయం అందజేసిందని తెలిపారు. వైద్యానికి లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, కుటుంబానికి ఉపాధి లేకుండా పోయిందని, డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యం మెరుగైన చికిత్స అందించాలని, తగిన పరిహారం చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విరాళం ఇచ్చిన వారిలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మునాయుడు, ఎం.ఈశ్వరరావు, నాయ కులు పి.రామకృష్ణ, కె.శంకరరావు, ఎన్.హెచ్.నాయుడు, ఎమ్.రామునాయుడు తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ కె.నాగమణి, కోకన్వీనర్ అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో డి.అనురాధ, కె.జ్యోత్స్న, కె.ఉమ అధ్యక్షతన ఆదివారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అనేక సమస్యలు ఇంకా ఎదుర్కొంటునే ఉన్నారని అన్నారు. దీనిని అధిగమించడానికి సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి మాట్లాడుతూ ఓటు హక్కు సాధన, పని గంటల తగ్గింపు, వేతనాల పెంపు కోసం మహిళలు పోరాడిన దినం మార్చి 8 అని తెలిపారు. ఈ స్ఫూర్తితో మహిళలంతా ఏకం కావాలన్నారు. మహిళలు ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడినా శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదని అన్నారు. అందరూ కలిసి పాటలు, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉత్సాహంకరంగా పనిచేయాలని పిలుపుఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సిర్ల ప్రసాద్, అంగన్వాడీ, ఆశా, విఒఎలు కె.లక్ష్మి, ఎస్.ధనలక్ష్మి, పి.జయలక్ష్మి, గౌరమ్మ, ఉమ, విజయలక్ష్మి, పూర్ణ, లక్ష్మీప్రసాద్, అప్పన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాగమణి

ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కమ్యూనిటీ ఆస్పత్రుల సమన్వయా ధికారి డాక్టర్ ఎన్.కళ్యాణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. థియేటర్ అసిస్టెంట్, ఫిజియో థెరపిస్టు, ఆడియోమెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్లు, ప్రింటర్ వంటి వివిధ పోస్టుల భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల ఈ నెల 10 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఏడాది కాలపరిమితి నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేపడతామని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు జిల్లా వెబ్‌సైట్ https://srikakulam.ap.gov.inను సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు డిసిహెచ్ఎస్ కార్యాలయం నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా

శ్రీకాకుళం: నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో దండివిధి, మేరకు డచ్ బంగ్లా, కంపోస్టు కాలనీ, దమ్మవిధి, వాంబే కాలనీ ప్రాంతా ల్లో ఆదివారం డ్రోన్ కెమెరాల నిఘా పెట్టారు.

ముగిసిన టెక్ ఫెస్ట్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీకాకుళం రాజీవ్ గాంధీ విజ్ఞానిక విశ్వవిద్యాలయంలో జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. గత మూడు రోజులుగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచార్య కొక్కిరాల వెంకట ధన బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన కృష్ణ చౌదరి స్టాల్స్‌ని సందర్శించారు. ఈ టెక్నివర్స్‌లో ఐఐటి గువహతి, ఐఐటి తిరుపతి, ఐఐటి హైదారాబాద్, ఐఐటి మద్రాస్, ఐఐటి జోధ్పూర్, ఐఐటి భువనేశ్వర్, ఇస్రో నుంచి ఎన్ఐటి నాగపూర్ ప్రొఫెసర్లు, లెక్చర్లు ఎఐ, సెన్సార్, హైడ్రాలజీ, మెకానికల్ బిహేవియర్ ఆఫ్ హైటెంపరేచర్ అల్లాయ్స్, విఎల్ఎస్ఐ, పవర్ ఎలక్ట్రానిక్స్‌లపై ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ టెక్ని వెర్స్‌లో డిపార్ట్‌మెంట్ వర్క్‌షాప్, టెక్నికల్ క్విజ్, రోబోటిక్స్, టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ ఇలా 50కిపైగా ఈవెంట్స్ నిర్వహించారు. విద్యార్థులకు ఐఐటి ఇస్రో నుంచి వచ్చిన ఉత్తమ ప్రొఫెసర్లతో సెమినార్ నిర్వహించారు. సెమినార్ ఈవెంట్‌కి మేజర్‌గా స్పాన్సర్లు చేసిన కెనరా బ్యాంకు, లియో గ్లోబల్ ఓవర్సీస్, ట్రేడ్ మిలాన్, యూనియన్ బ్యాంకు, ఏటా అల్ట్రా ఇన్నోవేషన్‌కి సహాయ సహకారాలు అందించినందుకు క్యాంపస్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ టెక్నివెర్స్‌కి కన్వీనర్ డీన్ వెల్ఫేర్ గేదల రవి, కో-కన్వీనర్ సివిల్ విభాగపతి సిహెచ్.తేజ కిరణ్ ఉన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ సిహెచ్.వాసు, అకౌంట్స్ ఆఫీసర్ కె.మోహనరావు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రొఫెషర్లు, విద్యార్థులు

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న శ్రీహరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

2003 డిఎస్‌పి నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని 2003 డిఎస్‌సి ఫోరం జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో డిఎస్‌సి ఫోరం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2003లో డిఎస్‌పి నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రెండేళ్ల అనంతరం ఉద్యోగాలిచ్చి పాత పెన్షన్ వర్తించకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ వర్తింప జేసేందుకు మెమో నంబరు 57 జారీ చేసినా పాత పెన్షన్‌ను కాదని సిపిఎస్‌లోకి నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పునరాలోచన చేసి పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఫోరం కో-కన్వీనర్లుగా పి.శ్రీకర్, కె.ప్రకాష్, బి.శ్రీనివాస రావు, ఎ.లక్ష్మణరావులను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ఫాల్గుణరావు, ఎం.బుచ్చిబాబు, జి.భాస్కరరావు, ఆపస్ జిల్లా అధ్యక్షులు డి.శివరాంప్రసాద్, జి.చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ఊతం

- జీవన ప్రమాణాల పెంపునకు చర్యలు
- ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్
- 36,133 సంఘాలకు రూ.1821.94 కోట్లు బ్యాంకు లింకేజీ
- డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహిళలు స్వయంశక్తితోపైకి రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా ప్రాధాన్యత ఇస్తుందని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యాన పంటల్లో ఉత్పత్తి అవుతున్న వాటి నుంచి ఆగ్రో బేస్డ్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వం ఊతమిస్తోందని తెలిపారు. మరోవైపు మహిళల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 36,177 స్వయంశక్తి సంఘాలకు రూ.1821.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు లక్ష్యంగా నిర్ణయించామని అన్నారు. అందులో ఇప్పటికే 17.023 సంఘాలకు రూ.1294.28 కోట్లు అందించామన్నారు. ఉమెన్ ఎంటర్ప్రెజ్ యాక్సిలరేషన్ ఫండ్ ద్వారా 1295 గ్రామైక సంఘాలకు 6900 యూనిట్లు నెలకొల్పడానికి నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే సుమారు 3 వేల యూనిట్లు నెలకొల్పామని వివరించారు. మహిళల జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ సహకారంతో మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని వివరించారు. జిల్లాలో 49.076 స్వయంశక్తి సంఘాల్లో 5,53,546 మంది సభ్యులున్నారని అన్నారు. 30 మండల సమాఖ్యలు, 1293 గ్రామైఖ్య సంఘాల ద్వారా సేవలందిస్తున్నామని తెలిపారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? మహిళా సాధికారతకు ఎలాంటి ప్రోత్సాహం లభిస్తోంది?

జిల్లాలో ఎక్కువ మంది మహిళలు నిరక్ష్య రాస్యులుగానే ఉన్నారు. వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాల్లో వారికి చోటు కల్పించేందుకు అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వారి జీవన ప్రమాణాల మెరుగుపర్చడానికి, వారిని పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి పెద్దఎత్తున రుణాలు ఇస్తున్నాం. ఆస్పత్రుల నిర్వహణ, బ్యూటీ క్లినిక్‌ల నిర్వహణ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు, ఇతర పారిశ్రామిక రంగాల్లో భాగస్వాములను చేస్తున్నాం. జిల్లాలో కొన్ని మహిళలు గ్రూప్‌లుగా ఏర్పడి చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధానంగా ఉత్పాదకతను పెంచడానికి వారు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం కీలకం. మహిళలకు మార్కెటింగ్ చేసుకునేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం.

? మార్కెట్ ప్రాధాన్యత ఉత్పత్తుల తయారీ ఎలా సాగుతోంది?

జిల్లాలో మహిళలు తయారు చేస్తున్న అనేక ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా నరసన్నపేట, సోంపేట మండలాల్లో అప్పడాలు, సారవకోటలో చుప్పులు, మందస కోవా, బుడితి, మాకివలస గ్రామాల్లో ఇత్తడి వస్తువులు తయారీ వంటి యూనిట్లు నడుస్తున్నాయి. వాటి పరిధిలో ఉత్పత్తిచేస్తున్న వాటిని స్థానికంగా మాత్రమే అమ్ముకోగలుగుతున్నారు. వాటిని ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు వీలుంటుంది. ఫుడ్ ప్రోసెసింగ్ ఉత్పత్తులను సకాలంలో లబ్ధిదారులకు చేరవేయడం ద్వారా ప్రయోజనం పొందగలరు.

? ఎలాంటి రుణాలు ఇస్తున్నారు?

స్త్రీ నిధి రుణం పొందాలంటే తప్పక సంఘ సభ్యులై ఉండాలి. సభ్యులు సమృద్ధి పొదుపు రూ.7,200 డిపాజిట్ చెల్లించి ఉండాలి. అలాగే మండల రికవరీ 75 శాతం, విఒ రికవరీ 90 శాతం, ఎస్‌హెచ్‌జి రికవరీ 98 శాతం ఉండాలి. బ్యాంకు లింకేజీ రుణం పొంది డిపాల్టరు కాకుండా ఉండాలి. అటువంటి సంఘ సభ్యులకు రూ.6 లక్షల వరకు రుణం పొందడానికి వీలుంది. రుణం పొందిన సభ్యులు 24 నుంచి 36 నెలల సులభ వాయిదాలపై 11 శాతం వడ్డీతో రుణం చెల్లించాల్సి ఉంటుంది. తరగతి వృత్తులు, వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, పాడి పరిశ్రమ, చిన్నతరహా వ్యాపారాలకు రుణం తీసుకోవచ్చు. ఒక్కో సభ్యులు రూ.లక్ష వరకు రుణం పొందేందుకు వీలుంటుంది. రుణం పొందిన సభ్యులకు బీమా సౌకర్యం ఉంటుంది. ఈ అవకాశాన్ని సభ్యులు సద్వినియోగపర్చుకుని సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా స్త్రీనిధి బలోపేతం చేసుకునేందుకు వీలవుతుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 22,485 మంది సభ్యులకు రూ.138.19 కోట్లు రుణం చెల్లించి లబ్ధి చేకూర్చం.

? 'ఉన్నతి' ద్వారా ఎలాంటి సౌలభ్యం ఉంది?

ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులతో మహిళలకు రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. సూక్ష్మప్రణాళిక ప్రాతిపదికన ఆర్థికాభి వృద్ధికి తోడ్పాటు అందిస్తున్నాం. రూ.20 నుంచి రూ.రెండు లక్షల వరకు రుణం పొందడానికి వీలుంది. చిరు వ్యాపారాలు, సొంతంగా ఆటోలు కొనుగోలు చేసుకుని సొంతంగా నడుపుకునేందుకు వీలుందన్నారు.

? ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారు?

జిల్లాలో వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళ తదితరులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు 3,11,533 ఉన్నాయి. సకాలంలో పింఛన్లు పొందలేని లబ్ధిదారులకు వచ్చే నెలలో పొందడానికి వెసులు బాటు కల్పించాం. జిల్లా వ్యాప్తంగా ప్రతినెలా రూ.129.61 కోట్లు పింఛను రూపంలో అందిస్తున్నాం. 92 మంది మేజరు డిసీజెస్ పర్సన్స్‌కు రూ.10 వేలు వంతున రూ. 9.50 లక్షలు, సికెన్ సెల్ డిసీజెస్‌తో బాధపడుతున్న 256 మందికి రూ.26 లక్షలు, మెమో ఫెలియోతో బాధపడుతున్న 36 మందికి రూ.3.80 లక్షలు, 75 మంది కిడ్నీ బాధితులకు రూ.7.60 లక్షలు, పక్షవాతంతో బాధపడుతూ మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు వంతున రూ.7.65 లక్షలు ఇతర వ్యాధులతో ఉన్న వారికి పింఛన్లు ఇస్తున్నాం. వ్యాధుల బారిన పడిన 1432 మంది రూ.1.17 కోట్లు ప్రతినెలా పింఛను రూపంలో అందిస్తున్నాం.

అభినందిస్తున్న డిఇఒ తిరుమల చైతన్య

ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రయివేటు భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆక్స్‌ఫర్డు స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. తొమ్మిదో తరగతి చదువుతున్న కె.తేజశ్రీ, పదోతరగతి చదువుతున్న సిహెచ్ కార్తీక్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. ఏప్రిల్ నెలలో రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలు విజయవాడలో జరగనున్న నేథ్యంలో వీరిని ఆ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డిఇఒ తిరుమల చైతన్య చేతులమీదుగా బహుమతులను అందజేశారు.

మాట్లాడుతున్న వేణుగోపాల్

వికలాంగుల హక్కులను కాపాడాలి

ప్రజాశక్తి- నౌపడ

వికలాంగులకు అందజేసే రిజర్వేషన్ పక్కాగా అమలు చేయాలని, 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారి హక్కులు కాపాడాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆవల వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వికలాంగుల హక్కుల సాధన సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైలు, బస్ ప్రయాణాల్లో 40 శాతం దాటిన పాసులు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి రమణయ్య, మండల అధ్యక్షుడు బడగల ఎర్రన్నాయుడు, టెక్కలి మండల వికలాంగుల అధ్యక్షుడు పువ్వల చంద్రశేఖర్, ఉగాది మాధవ రావు, జిల్లా వికలాంగుల ప్రధాన కార్యదర్శి పి.మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని టిడిపి సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో, నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో సిసి రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సమస్యల పై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసెంబ్లీలో ప్రస్తావించారని అన్నారు. సమావేశంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

అండమాన్‌లో సిక్కోలు పుస్తక పరిచయ సభ

పలాస: పలాస మండలం మాకన్నపల్లికి చెందిన ప్రజా కవి, రచయిత కుత్తుం వినోద్ కుమార్ తెలుగు సమాజం ఆధ్వర్యాన రచించిన 'స్వాతంత్ర్యోద్యమంలో సిక్కోలు వీరులు' అనే పుస్తకాన్ని అండమాన్ పోర్ట్ బ్లేయర్లో ఆదివారం ఆవిష్కరించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా 2023లో ఆవిష్కరించిన ఈ పుస్తకంలో, మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉమ్మడి గంజాం జిల్లాలో నిర్వహించిన స్వాతంత్రోద్యమ పోరాటాన్ని పుస్తకానికి ఎక్కించారు. తెలుగు నేలపై నిర్వహించిన స్వాతంత్ర్యోద్యమ పోరాటాన్ని, ఉప్పు సత్యాగ్రహం, మందస కాల్పులు, రైతు యాత్ర, కిసాన్ మహాసభ, గాంధీ పర్యటన మరెన్నో కీలక ఘట్టాలను పుస్తకంలో పొందు పరిచారు. కార్యక్రమంలో తెలుగు సమాజం అధ్యక్షులు బత్తిని కూర్మారావు, తిమ్మల సుందర్రావు, తాళ వాసు, కుత్తుం ధర్మారావు, కోయిల రవి, తెప్పల హరికృష్ణ, బొడ్డు కామేష్, రాజు, వాసుదేవ్, కొయిల దేవరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సరుబుజ్జిలి: హలో సరుబుజ్జిలి – చలో పిఠాపురం పోస్టర్‌ను జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగలా జరుపుకోవాలన్నారు. ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, వీరమహిళలు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తులగాపు ధనుంజయ్, సంఘంశెట్టి తేజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు పేడాడ రమణ, బొగ్గు అప్పలరాజు, గొల్లపల్లి శ్రీధర్, సతివాడ రామకృష్ణ, మురాల మిన్నారావు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తెప్పల'కు పురస్కారం

పలాస: ఛతీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్ గుడియారి మారుతీ మంగళ భవన్‌లో 8,9 తేదీల్లో తెలుగు ద్వితీయ మహాసభ నిర్వహించారు. ఇందులో పలాసకు చెందిన రచయిత, నటులు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, లయన్స్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి వివిధ కార్యకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి సమ్మేలో పాల్గొని 'స్వర్గం కన్న నా భారత్ మిన్న' అంటూ కవితా గానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా ఛతీస్‌ఘడ్ తెలుగు మహాసభ సంఘ సంరక్షకులు జి.స్వామి, ఉపాధ్యక్షులు బర్రి జోగారావు, ఖర్గపూర్ తెలుగు సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, ప్రముఖ కవి సిరికి స్వామినాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకావిష్కరణ

పలాస: ఛతీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో నిర్వహించిన ద్వితీయ తెలుగు మహాసభలు రుద్రమూర్తి నిర్వహణ సారథ్యంలో బి.తులసీరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, మండల బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్, సినీ నటులు సాయికుమార్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని జానపద కళాకారుడు కూర్మారావు సేకరించి ప్రచురించారు. ఉద్దాన కిడ్నీ బాధితుల సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలని శిష్టు మనోజ్ కుమార్, డాక్టర్ కుమార్ నాయక్, సాౌ్ర రామారావు, పొట్టి శివకుమార్, రచయిత నిషితాషి, టి.కృష్ణమూర్తి నివేదించారు. ఈ సందర్భంగా పలాస ప్రాంతానికి చెందిన కళాకారుల బృందం పలు జానపద పాటలతో ఉర్రూతలూగించారు. నోము నో మన్నాల తుమ్మెదలా, మేము కళాకారులం ,మందులోడా, వాకిట పూసిన వాడంబరాలు, వెళ్లిపోతావ్ రా మనిషి, చిన్నక్కో ఉద్దానం చూడు పలు పాటలు ఛతీస్‌ఘడ్ తెలుగు ప్రజలకు ఆనంద డోలికలు కలిగించారు. గిడుగు రామ్మూర్తి కళాపీఠం కన్వీనర్ సిస్టు మనోజ్ నేతృత్వంలో ఎపి జానపద కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, ప్రముఖ రచయిత వంకల రాజారావు, అరుణోదయ సేవా సంఘ కార్యదర్శి సోర్ర రామారావు కోరస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

ఆక్రమణల తొలగింపు

- ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం
- వీధినపడిన వ్యాపారులు
- శ్మశానంలా తయారైన రణస్థలం

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభించారు. ఉదయం 6 గంటల నుంచి హైవే, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది, పోలీస్ బందోబస్తుతో నాలుగు జెసిబిలతో వచ్చి రణస్థలం మండల కేంద్రంలోని 16వ నంబర్ జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. ఉదయం సరికే ఆకస్మాత్తుగా వచ్చి ఆక్రమణలు తొలగించడంతో వ్యాపారస్తులు ముందుగా వస్తువులు తీసుకోకపోవడంతో చాలా వరకు నష్టపోయారు. అయితే రోడ్డుకి అనుకుని ఉన్న కాలువ నుంచి ఎన్ని మీటర్ల వరకు ఆక్రమణలు తొలగించాలో స్పష్టత లేదని ఇష్టానుసారంగా తొలగిస్తున్నారని వ్యాపారులు ప్రతిఘటించడంతో అధికారులు కాలువ నుంచి రెండు

జెసిబితో ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

మీటర్లు తొలగిస్తామని చెప్పి టేపు పట్టుకుని వచ్చి కాలువ నుంచి రెండు మీటర్లు కొలతలు వేసి మార్కింగ్ చేసి మరలా ఆక్రమణలు తొలగించడం ప్రారంభించారు. షాపుల ముందు ఉన్న రేకుల షెడ్లు తొలగించి కాలువ నుంచి రెండు మీటర్లు వరకు జెసిబిలతో తవ్వడంతో రణస్థలం మండల కేంద్రం శ్మశానంలా తయారైంది. షాపుల ముందు తవ్వడంతో షాపుల్లోనికి కస్టమర్లు వెళ్లడానికి దారి లేకుండా పోయింది. హైవే అధికారులు తక్షణమే శిథిలాలను తొలగించకపోతే ఇబ్బందులు తప్పవని వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభం నుంచి పూర్తవ్వడానికి రెండేళ్లు పడుతుందని సంబధిత అధికారులు చెప్పడంతో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పుట్‌పాత్ వ్యాపారస్తులను పూర్తిగా తొలగించడంతో వందలాది కుటుంబాలు వీధినపడ్డాయి. ఆక్రమణలు తొలగింపు కార్యక్రమాన్ని శ్రీకాకుళం డి.ఎస్.పి. సి.హెచ్.వివేకానంద పర్యవేక్షించారు. అలాగే నేషనల్ హైవే అధికారి సతీష్ కుమార్, తహశీల్దార్ ప్రసాద్, సిఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు బట్టుపాలెంలో సిసి రోడ్లు, కాలువలు

- రూ. 5 లక్షల నిధులు మంజూరు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన
- దీర్ఘకాలిక సమస్య పరిష్కారం

నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువలు

లావేరు: మండలంలోని కొత్తకోట పంచాయతీ బట్టుపాలెంలో ఎట్టకేలకు మురుగునీరు రహదారి, కాలువల సమస్యలు పరిష్కరమయ్యాయి. గత ఆరేళ్లుగా గ్రామంలో నివాసాల ముంగిట కాలువలు, సిమెంట్ రోడ్డు లేక మురుగునీరు ఇళ్లముందే మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే వారు. మురుగునీరుతో అవస్థలు అనే శీర్షికతో ఇటీవల 'ప్రజాశక్తి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పల్లెపండగా కార్యక్రమంలో భాగంగా మురుగునీరు సమస్య శాశ్వత పరిష్కరానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారు. అలాగే వెనువెంటనే నిర్మాణం పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. దీంతో గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కిల్లాన శ్రీనువాసరావు పనులు ప్రారంభించారు. వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు మురుగునీరు బయటకు పోయేందుకు సుమారు వంద మీటర్లు మేర కాలువ నిర్మించారు. గ్రామంలో మురుగునీరు సమస్య శాశ్వత పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోఏళ్లుగా ఉన్న

రోడ్డు నిర్మాణానికి ముందు నివాసాల ముందు ఉన్న మురుగునీరు (ఫైల్)

సమస్యను వెనువెంటనే పరిష్కరించడానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఎన్ఇఆర్‌కు, అధికారులకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమస్య పరిష్కారానికి పలుమార్లు వార్తల రూపంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజాశక్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వ్యక్తి వికాసానికి విలువలతో కూడిన విద్య దోహదపడుతుందని విశ్రాంత డిఎంహెచ్ఒ డాక్టర్ లీలా అన్నారు. మండలంలోని పూండి సాయి వినీత్ విద్యా సంస్థలో ఆదివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటూ తాము చేసే పనిలో పది మందికి పరోపకారిగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సినీ సాంస్కృతిక కార్యక్రమాలు

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న డాక్టర్ లీలా

పోలాకి : సన్మానిస్తున్న జనార్థనరావు

నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కోదండరాం, ప్రిన్సిపాల్ అన్నెపు కైలాసరావు, వైస్ ప్రిన్సిపాళు బత్తిని శ్రీనివాసరావు, సాయి గోపాల్, ప్రదీప్, ధర్మారావు, షణ్ముఖరావు, మోహనరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక స్వర్ణ భారతీ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్ వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుజాత, చాట్ల రాము, నవీన, నీలిమ, ప్రిన్సిపాళ్లు సందీప్, జయప్రకాష్ పాల్గొన్నారు.

పోలాకి : విద్యార్థి దశ నుంచే కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వైద్యులు పైల రమణ, కిల్లి సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ నిర్వహించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం మెట్ట జనార్థనరావు, కొండమ్మ దంపతలు వైద్యులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యా యులు లోకనాథం, చంద్రరావు, అప్పలనాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

నరసన్నపేట : స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ఫేర్ వెల్ నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎం.ఎస్.మణి, సిజిఎం ఆర్.వసంత, ప్రిన్సిపల్ ధర్మాన వాసుదేవరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జ్ఞాపికలను అందజేస్తున్న తులసీదాస్‌రెడ్డి

ఎమ్మెల్యే పరామర్శ

రణస్థలం రూరల్: మండలంలోని పైడిభీమవరం టిడిపి నాయకులు పోపూరి శివరామ ప్రసాద్ (హోటల్ ప్రసాద్) పెద్దకుమారుడు విజయసాగర్ భార్య దివ్య ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం ఆమె మృతదేహం వద్ద నివాళ్లర్పించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయనతో పాటు స్థానిక సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాసరావు, కూటమి నాయకులు పిసిని జగన్నాధం నాయుడు, వడ్డాది శ్రీనివాసరావు, వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, వెలిచేటి సురేష్ కుమార్, ముప్పిడి సురేష్, జీరు గురునాయుడు తదితరులున్నారు.

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న కలెక్టర్ దంపతులు

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సతీసమేతంగా సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని ఆలయ సూపరెంటెండెంట్ కనకరాజు అందజేశారు

రూ. 8.54 లక్షల ఆదాయం

అరసవల్లి ఆలయానికి రూ.8.54 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.5,97,800, విరాళాలు రూ.91,525, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 1,65,635 ఆదాయం వచ్చినట్టు ఇఒ భద్రాజీ తెలిపారు.

ప్రభుత్వ విప్‌కి సన్మానం

ఇచ్ఛాపురం: ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అసెంబ్లీలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యపై ప్రస్తావించారు. దీంతో ఆటో, టాటా మ్యాజిక్ వాహనాల యూనియన్ నాయకులు విప్‌కు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. యూనియన్ నాయకులు కొండ శంకర్‌రెడ్డి, బి.మోహన్‌రెడ్డి, ఉలాస ఎర్రయ్య రెడ్డి, పి.హరి, ముకుందరావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పాటుపడాలి

వజ్రపుకొత్తూరు: మహిళా సాధికారతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎపిఎం గొడబ ప్రసాదరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడినప్పుడే సాధికారత సాధ్యమవు తుందన్నారు. స్వయంశక్తి సంఘాల బలోపేతం చేస్తూ, నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయడంలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ సిసి బి.హరిప్రియ, ఉత్తమ విఒఎ ఎం. సునీతలకు సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. మండల సమాఖ్య అధ్యక్షులు సరస్వతి, సెక్రటరీ చంద్రకళ, కోశాధికారి కళ్యాణి, సోంపమ్మ, అకౌంటెంట్లు మీనా, సౌజన్యలు పాల్గొన్నారు.

పలాస : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, జెఎసి జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు అన్నారు. స్థానిక ఎస్‌టి బాలికల వసతిగృహంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివాసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయరాలకు సన్మానించారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఈశ్వరరావు, చంద్రశేఖర్, రామారావు, మోహనరావు, సిద్ధు, లోకేష్, చిన్నబాబు, ఎర్రం నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: మహిళల భాగస్వామ్యం లేనిదే అభివృద్ధి సాధ్యం కాదని, అన్నింటా వారి పాత్ర ఎంతో కీలకమని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, స్టార్ వాకర్స్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పిజి గుప్త, రవిశంకర్, జోగినాయుడు పేర్కొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో వాకర్స్ ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు.

ఆలయ మండప ప్రతిష్ట

ప్రజాశక్తి- కవిటి

కవిటిలోని పురాతనమైన చంద్రశేఖర ఆలయ మండపం పున ప్రతిష్ఠ, విఘ్నేశ్వర, కుమారస్వామి ఉప ఆలయాన్ని ఆదివారం ప్రతిష్టించారు. దేవాదాయశాఖ సహకారంతో సిజిఎఫ్ నిధులు రూ.40 లక్షలు, స్థానిక దాతలు అందించిన సహకారంతో చంద్రశేఖర ఆలయానికి కొత్త సొబగులు అద్దారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ రామారావు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ నూతన మండపాన్ని ప్రారంభించారు. అనంతరం వీరిని ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, బెందాళం చిట్టిబాబు, బెందాళం రమేష్, ఆరింగి మధు, పాండవ రామారావు, పాండవ చంద్రశేఖర్, పూడి కూర్మయ్య, బెందాళం రమణమూర్తి, బెందాళం తిరుమల, పొల్లాయి లక్ష్మణమూర్తి, తమరాల జయరాం, ఆరింగి త్రివిక్రమరావు, పొల్లాయి మోహనరావు పాల్గొన్నారు.

కవిటి : శంకుస్థాపన చేస్తున్న విప్ అశోక్

నందిగాం : మండలంలోని నరేంద్రపురంలో నూతనంగా నిర్మించిన రొయ్యబోడెమ్మ భూలోక మాత ఆలయాన్ని ప్రతిష్ఠించారు. ఆలయ పురోహితులు వైద్య భూషణ్ సత్యనారాయణ శర్మ, బంకుపల్లి సంతోష్ శర్మ తదితరుల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చెక్కును అందజేస్తున్న డాక్టర్ దానేటి

రూ.పది లక్షల విరాళం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కృష్ణా పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ అభ్యర్ధన మేరకు మెడికవర్ ఆస్పత్రి ఎండి, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ రూ.10లక్షల విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతికి మెకవర్ ఆస్పత్రిలో చెక్కును అందజేశారు. అలాగే హోంగార్డుల సహాయ నిధికి తనవంతు సాయంగా రూ.2 లక్షల విరాళాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ వైద్యరంగంలో ప్రజలకు సేవలందించిన డాక్టర్ శ్రీధర్ సామాజిక బాధ్యతతో సేవ చేసేందుకు తనవంతు సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి గిరిజా శంకర్, అందవరపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించేస్తుంటే... ఆలోచిస్తున్నారు

ప్రజాశక్తి- కవిటి

మేజర్ పంచాయతీలో రోజురోజుకూ పెరిగిపోతున్న ఆక్రమణలపై అధికారులు వేచిచూసే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఇటీవల గ్రంథాలయానికి దారేది అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై కొంతమంది పంచాయతీ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇదే వ్యక్తులు అదే పంచాయతీ కార్యాలయం సమీపంలో దశాబ్దాలుగా ఉన్న ఓ క్షరకుడు షాపు ఆక్రమణ పేరుతో తొలగించేందుకు ప్రయత్నించారు. వాస్తవానికి అతను అదే షాపుపై తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇప్పటికీ ఆ షాపే అతనికి ఆధారం. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. వాస్తవానికి ఆక్రమణలు అనేవి ఎప్పటి నుంచో కవిటి పంచాయతీలో ఉన్నవే. అయితే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో ప్రస్తుతం అవి

కవిటిలో ఆక్రమణలకు గురైన సిసి రోడ్డు

మితిమీరిపోతున్నాయి. దీన్ని ఆసరాగా తీసుకొని కవిటి ఎస్‌బిఐ బ్యాంకు సమీపంలో ఏకంగా ఒక సిసి రోడ్డు బ్లాక్ చేసిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు కర్ర విరగకూడదు.. పాము చావాలి అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో ప్రస్తుతం ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు అంటున్నారు. ఈ తంతు కవిటిలోనే కాకుండా పంచాయతీకి సమీపంలోని గ్రామాల్లో కూడా కొన సాగుతోంది. గతంలో 10 టైర్ల లారీలు తిరిగే రోడ్లలో ప్రస్తుతం ట్రాక్టర్ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గ్రామాల్లో సిసి రోడ్లు వేసిన తరువాత రోడ్డు అంచుతో ఇళ్ల నిర్మిస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై పంచాయతీ అధికారులతో పాటు ఆర్అండ్‌బి, పోలీస్ శాఖ మూకుమ్మడిగా దృష్టి సారిస్తే ఆక్రమణలకు ముగింపు లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆయా అధికారులు తమ పరిధిలోని ఆక్రమణలు తొలగించి భవిష్యత్ తరాలకు 'మార్గ'దర్శం చేయాల్సిన అవసరం ఉంది.

ఎవ్వరినీ ఉపేక్షించం

ఆక్రమణలపై ఇప్పటికే మాకు చాలా ఫిర్యాదులు వచ్చాయి అయితే ఎన్నికల కోడ్ వల్ల ముందుకు వెళ్లలేకపోయాం ఇప్పటికే ఎక్కడెక్కడ ఆక్రమణలో ఉన్నాయో వారికి హెచ్చరించడం కూడా జరిగింది కేవలం కమిటీ లోనే కాకుండా పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో కూడా కచ్చితంగా ఆక్రమణలు తొలగిస్తాం.

– వీరభద్రస్వామి, ఇఒ, మేజర్ పంచాయతీ, కవిటి

నూతిలో పడి బాలుడి మృతి

కుమారస్వామి మృతదేహం

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ గోపినాథపురానికి చెందిన బెండి కుమారస్వామి (దీపక్) (16) ఆదివారం నూతిలో పడి మృతి చెందాడు. దీపక్ తన స్నేహితులతో కలిసి గోపీనాథపురం సమీపంలో ఉన్న నూతికి స్నానానికి వెళ్లాడు. అందులో జారిపడడంతో నీటితో మునిగి పోయాడు. సమాచారం కుటుంబ సభ్యులు, గ్రామ స్తులు నూతిలో దిగి బయటకు తీసుకొచ్చి హుటా హుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. కుమారుడు మృతి చెందడంతో తల్లి దండ్రులు సుహాసిని, ఆనందరావు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీపక్ అందరితో కలివిడిగా ఉండే వాడని మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రామారావు

వ్యక్తికి గాయాలు

లావేరు: రణస్థలం నుంచి రాజాం వెళ్లే రహదారిపై సీతంవలస పచ్చులమ్మా చెరువు సమీపంలో రహదారికి ఉన్న క్రాస్ బేరియర్స్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లావేరు గ్రామానికి చెందిన పతివాడ రామారావు రణస్థలం నుంచి లావేరుకు దిచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు రక్షణ క్రాస్ బేరియర్స్ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడటంతో రోడ్డుపై అచేతనంగా పడి ఉండడంతో రహదారి గుండా వెళ్లిన వాళ్లు గ్రహించి తమ వాహనాలు నిలుపుదల చేసి పడివున్న రామారావుకు నీళ్లపట్టి సపర్యలు చేసి వారి కుటుంబీకులకు సమాచారం అందించి వైద్యం కోసం ఆస్పత్రికి తరలించి రణస్థలం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

దగ్ధమైన బైక్

వజ్రపుకొత్తూరు: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. శనివారం సాయంత్రం నుంచి వాహనం బీచ్‌లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనానికి నిప్పు పెట్టారని సమాచారంతో ఎస్ఐ బుడుమూరు నిహార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. వాహనం కొత్తూరు మండలానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించి ఆయనతో మాట్లాడారు. కొద్ది రోజుల కిందట వాహనాన్ని షో రూమ్‌కి ఇచ్చేసి ఆ స్థానంలో కొత్త వాహనం తీసుకున్నట్లు తెలిపినట్టు ఎస్ఐ వివరించారు. అయితే బీచ్‌లో దహనమైన వాహనం ఎవరు తీసుకొచ్చారో అనే విషయమై ఆరా తీస్తున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు సురేష్

వైద్యశిబిరానికి స్పందన

శ్రీకాకుళం: ప్రముఖ వైద్యులు, సంఘసేవకులు, లైయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డా.బొడ్డేపల్లి సురేష్ హిరమండలం మండలం శుభలయి గ్రామంలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వహించి 300 మందికి బిపి, షుగర్, పక్షవాతం, గుండెకు సంబంధించిన రోగాలపై అవగాహన కల్పించి మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు రమణ, చిట్టిబాబు, సర్పంచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు. యువజన కమిటీసభ్యులు పాల్గొని మొక్కలు నాటారు.

రూ.10.60 కోట్లతో రహదారుల నిర్మాణం

ఆమదాలవలస: నియోజకవర్గంలోని పొందూరు మండలంలో రహదారుల నిర్మాణానికి రూ.పదికోట్ల 60 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పథకంలో మంజూరైన ఈ నిధులతో ఆరు తారురోడ్ల రహదారులు నిర్మాణం జరగనున్నాయని పేర్కొన్నారు. పొందూరు మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్, రహదారులు, భవనాల శాఖామంత్రి బిసి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

శంకుస్థాపన చేస్తున్న తులసీవరప్రసాదరావు

తాగునీటి బోర్లు మంజూరు

కొత్తూరు: వంశధార నిర్వాసిత గ్రామమైన మెట్టూరు బిట్–2 పంచాయతీకి రూ.3 లక్షలు విలువైన రెండు తాగునీటి బోర్లు మంజూరైనట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ఒక బోరు ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెట్టూరు బిట్ 1,2 ఎంపిటిసిలు పొడ్డిని సింహాచలం, పెదకోట ఆదినారాయణ, గవర తిరుపతిరావు, ఇసై ప్రశాంత్ కుమార్, చిట్టిబాబు, దాసు, రామారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట : పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో మూత్ర పిండాల వ్యాధి ప్రాజెక్టులో లేబ్ టెక్నీషియన్లుగా పనిచేయుటకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జార్జ్ ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ ప్రతినిధులు ఒక ప్రకటనలో కోరారు. ఉద్దాన ప్రాంతమైన సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలలో రక్తం నమూనాలు, డేటా సేకరణ చేసేందుకు ఏదైనా లేబ్ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణత, ఉద్దాన మండలాల్లో నివాసం ఉండేవారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు cureckdu.cv@gmail.comకు గాని, నేరుగా గాని దరఖాస్తులు పంపించాలన్నారు.